క్లుప్తంగా

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

- 'జగనన్నకు చెబుదాం' వేదికగా అర్హులకు న్యాయం
- నగర కమిషనర్ వి నిర్మల్ కుమార్



మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో ఏమైనా సమస్యలుంటే జగనన్నకు చెబుదాం కార్యక్రమం దృష్టికి తీసుకువస్తే సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని నగర కమిషనర్ వి నిర్మల్ కుమార్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యలను నేరుగా అధికారులను కలిసి ఫిర్యాదు చేయడంతో పాటు పరిష్కారం కాకుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

స్వచ్ఛభారత్‌తో ఆలయం పరిశుభ్రం



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ దుగ్గిరాల మండల అధ్యక్షుడు దానబోయిన వెంకట శివాజీ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు స్వచ్ఛ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈమని గ్రామంలో శ్రీ కోదండ రామాలయం దేవస్థాన పరిసర ప్రాంతాన్ని శుభ్రం చేసి ఆలయం చుట్టూ ఉన్న చెత్తను తొలగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుండూరు ఉమా మహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కన్నెగంటి ప్రశాంతి, చెన్నంశెట్టి సీతారాంబాబు, ఆలయ అర్చకులు, సిబ్బంది శివ తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. తెనాలి పట్టణ మారీసుపేటలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మొహిద్దీన్ షా అనే వ్యక్తి మద్యం విక్రయిస్తుండగా అతన్ని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 24 సీసాలు లభించాయి. దీంతో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఇంజినీరింగ్ సీటు ఇప్పిస్తానని మోసం

తెనాలిరూరల్: ఇంజినీరింగ్ సీటు ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన జమీర్ ఖాన్ కొడుకుకు ఇంజినీరింగ్ సీటు ఇప్పిస్తానని మంగళగిరికి చెందిన నాగ వెంకట శ్రీనివాస్ కొద్ది నెలల క్రితం కలిశాడు. కళాశాల ఫీజుతో పాటు కొంత ఖర్చు అవుతుందని చెప్పి పలు విడతల్లో రూ.రెండు లక్షలు తన ఖాతాకు ఫోన్‌పే ద్వారా నాగ వెంకట శ్రీనివాస్ వేయించుకున్నాడు. నెలలు గడుస్తున్నా సీటు ఊసే ఎత్తకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి జమీర్ ఖాన్ పోలీసులను ఆశ్రయించాడు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిరోజూ వ్యాయమం చేయండి

తెనాలిఅర్బన్: నేటి అధునిక ప్రపంచంలో ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం గంట పాటు వ్యాయామం చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పీపీ సునీల్ పేర్కొన్నారు. తెనాలి స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చినరావూరు పార్కులో ఏరోబిక్స్, జుంబాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏఎస్ఎన్ స్టేడియంలో ఉచితంగా ఏరోబిక్స్, జుంబాపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శిక్షకులు కె.శ్రీకాంత్, స్టేడియం డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు రాజేంద్రరెడ్డి, తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అచ్యుత సాంబశివరావు, వాకర్స్ పాల్గొన్నారు.

రేపు గ్రూప్-2 భౌగోళికశాస్త్రంపై ఉచిత శిక్షణ

తెనాలిఅర్బన్: యూటీఎఫ్, జీవీవీ, ఎన్‌జీవో అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో భౌగోళిక శాస్త్రంపై మంగళవారం ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేటలోని ఎన్‌జీవో కళ్యాణ మండపంలో సాయంత్రం 5 గంటల నుంచి 8.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. సీనియర్ ఉపాధ్యాయులు కుర్రా శ్రీనివాసరావు భౌగోళిక శాస్త్రంపై శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. గ్రూప్-2 పరీక్షలో భౌగోళిక శాస్త్రంపై 30 మార్కులకు ప్రశ్నలు ఉంటాయని, పరీక్షకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

మహాకాళేశ్వరుడికి పంచగవ్య పూజలు

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుచరిత



పంచగవ్య పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, నాయకులు

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామ శివారులో కోటిఒక్క లింగాల ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా రెండోరోజు ఆదివారం వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య పూజ, వాస్తు పూజ, కై లాస మండపారాధన, వాస్తుహోమం, వాస్తుబలి, శాంతి కుంభారాధనను వేదపండితులు కొండవీటి కృష్ణమూర్తి, కె.ఆంజనేయశర్మ, రామేశ్వర గురుకుల్‌లు నిర్వహించారు. అనంతరం మహాకాళీ, మహా కాళేశ్వర విగ్రహాలకు 11 నదుల నుంచి తీసుకువచ్చిన పవిత్ర జలాలతో అభిషేకాలు చేశారు.

కోటి ఒక్కలింగాల ప్రతిష్ఠ పూజల్లో ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకతోటి సుచరిత, మండల నాయకులు పాల్గొన్నారు. సుచరితను అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు జ్ఞాన ప్రసన్న స్వామి ఆశీర్వదించారు. ఆలయం వెలుపల నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, సర్పంచ్ ఎం.శివకుమారి, పార్టీ నాయకులు చిట్టా అంజిరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, కె.చిన్నప్పరెడ్డి, పాలపాటి రఘు, బి.అంజిరెడ్డి, డి. మెల్కియా, చేవూరి రామమోహన్‌రెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, ఖాజావలి, పి.శ్రీనివాసరెడ్డి, పి.కోటిరెడ్డి, మస్తాన్‌వలి, టి.కృష్ణ, చౌడయ్య, అప్పిరెడ్డి, సంజీవరెడ్డి, కె.బ్రహ్మారెడ్డి, ఎ.శ్రీనివాసరెడ్డి, వి.రాము, భార్గవి, వై.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణమూర్తిలు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం

వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని



మాట్లాడుతున్న షేక్ సుభాని

తాడేపల్లిరూరల్ : ముస్లిం మైనార్టీల సంక్షేమం గురించి మాట్లాడే అర్హత తెలుగుదేశం పార్టీ నాయకులకు లేదని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. ఆదివారం దుగ్గిరాలలోని ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీల సంక్షేమం సంక్షోభంలో పడిందని టీడీపీ నాయకులు అసత్య ప్రచారం చేయడం తగదని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ముస్లిం మైనార్టీలకు సంక్షేమంతో పాటు రాష్ట్ర చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు నలుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలతో పాటు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు వంటి అనేక పదవులు కేటాయించారని గుర్తు చేశారు. ఉర్దూను రెండవ అధికార భాషగా గుర్తించారని, హజ్‌యాత్రకు ఆర్థిక సహాయాన్ని పెంచారని, మౌజన్లకు 3 వేల నుంచి 5 వేలు, ఇమామ్‌లకు 5వేల నుంచి 10 వేల రూపాయల చొప్పున గౌరవ వేతనం ఇస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, షేక్ జానీ బాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫిరంగిపురంలో శోభాయాత్ర

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయం వద్ద అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేసి అష్టోత్తర, సహస్రనామ పూజలు వేద పండితులు రాజేంద్రశర్మ నిర్వహిస్తారని చెప్పారు. సాయంత్రం అఖండ దీపోత్సవం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉత్సవమూర్తులతో శోభాయాత్ర నిర్వహిస్తామని తెలిపారు.

నేడు గుడ్‌మార్నింగ్ మంగళగిరి

మంగళగిరి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం నుంచి గుడ్ మార్నింగ్ మంగళగిరి పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గంజి చిరంజీవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని ఆత్మకూరు టేకుతోట నుంచి సోమవారం ఉదయం ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో పాటు నాయకులు పాల్గొంటారని చెప్పారు. కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మంగళగిరి రూరల్ సీఐ బదిలీ

మంగళగిరి: మంగళగిరి రూరల్ సీఐ వి భూషణంను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండు సంవత్సరాల పాటు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న భూషణాన్ని ఎన్నికల నేపథ్యంలో బదిలీ చేయగా ఆయన స్థానంలో నూతన సీఐగా జి వెంకటరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చేనేత కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి



మహాసభలలో పాల్గొన్న నాయకులు

మంగళగిరి: చేనేత కార్మికుల ఆర్థిక పరిస్థితులను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన చేనేత రిజర్వేషన్ చట్టాలను మిల్లు యజమానులు ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా వస్త్రాలు తయారు చేస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని రాష్ట్ర చేనేత కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు కట్టా హేమసుందరరావు తెలిపారు. పట్టణంలోని రాజీవ్ సెంటర్‌లో గల పద్మశాలీయ కల్యాణ మండపంలో రెండు రోజుల పాటు జరిగిన చేనేత కార్మిక సంఘం రాష్ట్ర 13వ మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 రకాల వస్త్రాలను చేనేత పరిశ్రమకు కేటాయిస్తూ 1985లో తీసుకువచ్చిన రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చే యాలన్నారు. ప్రభుత్వాల విధానాలతో చేనేత కార్మికులు ఉపాధి కరువై అర్ధాకలితో బతుకు సాగిస్తూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. చేనేత పరిశ్రమ రక్షణ కొరకు, కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు కార్మిక సంఘం నిర్వహించే పోరాటాలలో కార్మికులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా బుగిడే మాధవస్వామి, ప్రధాన కార్యదర్శిగా పిల్లలమర్రి నాగేశ్వరరావు, కోశాధికారిగా బత్తూరి మోహనరావు, ఉపాధ్యక్షులుగా నీలూరి లక్ష్మయ్య, బి వెంకటనారాయణ, జొన్నాదుల భారతి, సహాయ కార్యదర్శులుగా పామిశెట్టి గోవిందు, పి హరి, వై పీతాంబరరావులతో పాటు మరో 35 మందితో నూతనంగా ఏర్పడిన కౌన్సిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మాజీ ప్రధాన కార్యదర్శి జింక చలపతి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, కె రామాంజనేయులు, చిన్ని తిరుపతయ్య, నందం బ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరాలపై పోలీసుల దాడి

తాడికొండ: తాడికొండ మండలం బండారుపల్లి గ్రామంలో కోడి పందేల స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడులలో ముగ్గురు వ్యక్తులతో పాటు రూ.1050 నగదు, చనిపోయిన కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.

ఘనంగా లెనిన్ శత వర్ధంతి వేడుకలు



లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి సీపీఎం కార్యాలయంలో లెనిన్ శత వర్ధంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం. రవి, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వల్లభాపురం వెంకటేశ్వరరావు సీపీఎం నాయకులతో కలసి లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రపంచ మానవాళి విముక్తికి మహోన్నత సిద్ధాంతాన్ని మార్క్స్, ఏంగెల్స్ అందిస్తే దానికి అప్పటి నిర్దిష్ట పరిస్థితుల్లో తన ఆలోచలను ఆచరణలో పెట్టి ప్రపంచంలోనే మొట్ట మొదటి సామ్యవాద కలను 1917 లో రష్యాలో సాకారం చేసిన మహానేత లెనిన్ అని అన్నారు. లెనిన్ మరణించి 100 ఏళ్లు కావస్తున్నా నేటికీ శ్రామిక, పీడిత, తాడిత, ప్రజానీకం లెనిన్ చూపిన బాటలో పయనిస్తూ తమ హక్కులను సాధించుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు సిహెచ్ సుందరరావు, ఎస్. ఇమ్మానియేల్ రాజు, టి. బక్కిరెడ్డి, పి.రాఘవులు, వి.పార్థసారధి, రాఘవయ్య, ఎస్. శేషయ్య, కె. కరుణాకర్, మస్తాన్‌రావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


తాడేపల్లి ఎస్‌హెచ్‌వో బాధ్యతల స్వీకరణ

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా ఎం.మధుసూదనరావు ఆదివారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటి వరకు ఎస్‌హెచ్‌వోగా పనిచేసిన మల్లికార్జునరావు రేపల్లెకు బదిలీ అయ్యారు. వీఆర్‌లో ఉన్న మధుసూదనరావును తాడేపల్లి ఎస్‌హెచ్ఓగా నియమిస్తూ గుంటూరు రేంజ్ సౌత్ కోస్టల్ జోన్ ఐజీ పాలరాజు ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు.

నేడు రాముల వారి రథోత్సవం

మంగళగిరి: అయోధ్యలో సోమవారం శ్రీ బాల రాముని దివ్య విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో శ్రీ సీతా రామచంద్ర స్వామి దివ్య రథోత్సవం నిర్వహించనున్నట్లు సీతారామ కోవెల ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి అనుగ్రహాన్ని పొందాలని కోరారు.


మాజీ చైర్మన్ సుబ్బయ్య సేవలు మరువలేనివి



సుబ్బయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ అఖిలేష్, డాక్టర్ అవినాష్ తదితరులు

తెనాలిఅర్బన్: తెనాలి మార్కెట్ యార్డు అభివృద్ధికి గడవర్తి సుబ్బయ్య చేసిన కృషి మరువరానిదని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడవర్తి సుబ్బయ్య సంతాప సభను రైల్వే స్టేషన్ రోడ్డులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం రాత్రి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ బీసీ సంఘ నాయకునిగా ఆయన అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలచి పోయారన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ తాడిబోయిన అఖిలేష్, డాక్టర్ తాడిబోయిన అవినాష్, ప్రముఖ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు, కౌన్సిలర్‌లు తాడిబోయిన రామయ్య, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, యార్డు వైస్ చైర్మన్ వంపుగళ్ళ కృష్ణ, కుర్రా శ్రీను, కాటుపల్లి శ్రీను, అంబరీషుడు, విష్ణువర్ధన్, నల్లగొర్ల నాగేశ్వరరావు, కరేటి రవి పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పోటీలు



తెనాలిఅర్బన్: శ్రీశారద సంగీతాలయం తెనాలి వారి ఆధ్వర్యంలో నెహ్రూరోడ్డులోని గోవర్ధన స్వామి దేవస్థానంలో ఆదివారం హనుమాన్ చాలీసా పోటీలు నిర్వహించారు. 80 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైకుంఠపురం దేవస్థాన కమిటీ మాజీ అధ్యక్షులు ఉప్పల వరదరాజులు మాట్లాడుతూ విద్యార్థులలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించేందుకు ఇవి దోహదపడతాయని చెప్పారు. అనంతరం పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆరాధ్యుల ఆదినారాయణ, భీమవరపు లక్ష్మీసౌజన్య, అందె బాలచంద్రమౌళి, సురాబత్తుల కేశవరావు, కొండపి శ్రీనివాసరావు, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మల్లేశ్వరి, అర్చకులు రఘు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుల గణన సర్వే

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుల గణన సర్వే ఆదివారం తెనాలి పట్టణంలో కొనసాగింది. వార్డు వలంటీర్, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి వారి కులాల వివరాలు నమోదు చేసి ఇంటి సభ్యులలో ఒకరితో బయోమెట్రిక్ వేయించారు. దీనిని ఈనెల 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

ఘనంగా పునీత ఆగ్నేసమ్మ వేడుకలు

హాజరైన ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



వేడుకలలో పాల్గొన్న మేకతోటి సుచరిత

మేడికొండూరు: స్థానిక పేరేచర్ల ఆర్‌సీఎం చర్చిలో పునీత ఆగ్నేసమ్మ అమ్మవారి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా పలు కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా గుంటూరు జిల్లా పీఠాధిపతులు చిన్నాబత్తుని భాగ్యయ్య హాజరై దివ్యపూజా బలి నిర్వహించారు. దివ్యపూజా బలికి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకతోటి సుచరిత పాల్గొని పునీత ఆగ్నేసమ్మ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని ప్రతి ఒక్కరూ ప్రేమతో ప్రార్థన చేసుకుని జీవితం సుఖమయం చేసుకోవాలని సూచించారు. వేడుకలలో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ఘనంగా అలంకరించారు. అనేక మంది దివ్యపూజా బలిలో పాల్గొని పునీత ఆగ్నేసమ్మ అమ్మవారి పవిత్రత గురించి భక్తులకు చాటి చెప్పారు. ఆలయ వేడుకలకు ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్, గుంటూరు రూరల్ మండలం జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, ముత్యాల బాల స్వామి, గద్దం రాంబాబు, జంధ్రాసుపల్లి నాగేశ్వరరావు తదితరులు హాజరై పునీత ఆగ్నేసమ్మ అమ్మవారి ఆశీర్వచనాలు పొందారు.

కేఎల్‌యూ విద్యార్థినికి గన్ ఫైరింగ్‌లో పురస్కారం



ఎన్‌సీసీ అధికారుల నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న షణ్ముఖి

తాడేపల్లిరూరల్ : 10వ ఆంధ్రా బాలికల ఎన్‌సీసీ బెటాలియన్ ఎనిమిదవ సామూహిక వార్షిక శిక్షణా శిబిరంలో కేఎల్‌యూకు చెందిన విద్యార్థినులు పలు రకాల పురస్కారాలు సాధించినట్లు 10వ ఆంధ్ర ఎన్‌సీసీ బెటాలియన్ లెఫ్టినెంట్ పావని ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పావని మాట్లాడారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వ విద్యాలయంలో బీఏ ఎల్ఎల్‌బీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జె.షణ్ముఖి గన్ ఫైరింగ్‌లో ద్వితీయ బహుమతి సాధించిందని తెలిపారు. షణ్ముఖి గన్ ఫైరింగ్‌తో పాటు నృత్య ప్రదర్శనలో బంగారు బహుమతి సాధించిందని వెల్లడించారు. పేరేచర్ల షార్ట్ రేంజ్‌లో నిర్వహించిన 0.22 గన్ ఫైరింగ్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు అత్యుత్తమ క్యాడెట్లను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. పాటలు పాడడం, క్యాంప్ నిర్వహణ వంటి పలు రకాల సాంస్కృతిక పోటీలలో కేఎల్‌యూ విద్యార్థినులు నవ్య, కల్పన, మైత్రి పురస్కారాలను సాధించగా ప్రెట్టో రాథోర్ ఉత్తమ క్యాడెట్‌గా పురస్కారం అందుకున్నారని వివరించారు. క్యాంప్ కమాండెంట్ ఎస్‌వీఎస్ సుదర్శన్ చేతుల మీదుగా ఆయా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిన క్యాడెట్లకు పురస్కారాలు అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొ వైస్ చాన్స్‌లర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్. హనుమంతరావు, లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పవన్ కుమార్‌లు పురస్కారాలు సాధించిన విద్యార్థినులను అభినందించారు.

పెనుమాకలో నేడు యాగశాల ప్రారంభం



సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

తాడేపల్లిరూరల్ : అయోధ్యలో శ్రీ బాల రామచంద్రస్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఎంటీఎంసి పరిధిలోని పెనుమాక శ్రీ వైష్ణవ మహా దివ్యక్షేత్రంలో నేడు యాగశాలను శాస్త్రోక్తంగా ప్రారంభించనున్నట్లు ఆదివారం శ్రీ వైష్ణవ మహా దివ్యక్షేత్ర సేవా సంఘం అధ్యక్షులు దూపుగుంట్ల శ్రీనివాసరావు తెలిపారు. నేడు యాగశాల ప్రారంభించిన అనంతరం యజ్ఞ పూర్ణాహుతి, సాయంత్రం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయ ముఖ మండపంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారి తిరు నక్షత్ర మహోత్సవం అంగరంగ వైభంగా నిర్వహించనున్నామని అన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు మాట్లాడుతూ ఏప్రిల్ 23వ తేదీ చైత్ర పౌర్ణమి నుంచి ఏడాది పాటు అఖండ హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నామని, 2025వ సంవత్సరంలో లక్ష మంది భక్తులతో విజయవాడ నగరంలో అఖండ హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వైష్ణవ మహాదివ్య క్షేత్ర సేవా సంఘం అధ్యక్షులు చలువాది మల్లికార్జునరావు, కోశాధికారి రెడ్డి ఉమామహేశ్వర గుప్తా, ఉపాధ్యక్షులు గట్టా ధనప్రసాద్, సంయుక్త కార్యదర్శి మామిడి లక్ష్మీ వెంకట కృష్టారావు, గౌరవ సలహాదారులు గార్లపాటి లీలా మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లిలో..

ఉండవల్లిలోని రెడ్ల రామ మందిరం వద్ద నేడు ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించటంతో పాటు సాయంత్రం సీతారాముల పవళింపు సేవ, ప్రసాదాల పంపిణీ, పలు భక్తి కీర్తనలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

ప్రతిరోజూ నడకతో ఆయుఃప్రమాణం పెరుగుతుంది

- ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ నోరి ఎల్‌కేఎం వీ ప్రసాద్
- వాకర్స్ క్లబ్ 24వ వార్షికోత్సవం
- క్లబ్ సభ్యుడు అచ్చయ్య రూ.50 వేల విరాళం



ఉత్తమ వాకర్స్ అవార్డు గ్రహీతలతో క్లబ్ బాధ్యులు


తెనాలి: పట్టణంలోని వాకర్స్ క్లబ్ 24వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటైన సభకు క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెనాలి రీజనల్ మేనేజర్ నోరి ఎల్‌కేఎంవీ ప్రసాద్ 'నడకతో ఆరోగ్యాన్ని కాపాడుకోవటం ఎలా?' అనే అంశంపై ప్రసంగించారు. ఆహార నియమాలు పాటిస్తూ ప్రతిరోజూ నడవటం వల్ల గుండె, ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉంటాయని, ఆయుః ప్రమాణం పెరుగుతుందని చెప్పారు. ప్రతి విషయానికి మానసిక ఒత్తిడికి లోనుకాకుండా, ప్రతి చిన్న అనారోగ్య సమస్యకు మందులపై ఆధారపడకుండా చూసుకోవాలని చెప్పారు. ఉత్తమ వాకర్స్‌గా వేములపల్లి వెంకట్రామయ్య, మెయ్య శ్రీలక్ష్మి, నాగం వెంకటేశ్వరరావును సత్కరించారు. సీనియర్ వాకర్లు జీపీపీ చంద్రశేఖరరావు, ప్రభల సూర్యనారాయణమూర్తి, రాపర్ల వెంకటనర్సయ్య, బీఎస్‌సీహెచ్‌పీ ప్రసాదరావుకు చిరు సత్కారం చేశారు. క్లబ్ సభ్యుడు దొడ్డపనేని అచ్చయ్య వాకర్స్ క్లబ్‌కు రూ.50 వేల విరాళాన్ని ప్రకటించారు. కార్యదర్శి కడియాల రవిబాబు స్వాగతం పలికిన సభలో ఎన్నారై లక్ష్మీరూపలత, ఎస్‌బీఐ కొత్తపేట ప్రధాన శాఖ చీఫ్ మేనేజర్ పవన్‌కుమార్, బోసురోడ్డు బ్రాంచి మేనేజరు వి.చలపతిరావు, టి.రత్తయ్య, మొవ్వా సత్యనారాయణ పాల్గొన్నారు.

జై శ్రీరామ్ అక్షరాలతో రామ మందిర చిత్రం



చిత్రాన్ని రూపొందించిన వెంకటకృష్ణ

తెనాలిఅర్బన్: నేడు అయోధ్యలోని శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని గుంటూరు జిల్లా తెనాలి మండలం పెదరావూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిత్రకళోపాధ్యాయుడిగా పనిచేస్తున్న పణిదెపు వెంకటకృష్ణ జైశ్రీరామ్ అనే అక్షరాలను దేవనాగరి లిపి (హిందీ)లో రాసి రామమందిర చిత్రాన్ని ఆదివారం రూపొందించారు.



జై శ్రీరామ్ అనే హిందీ అక్షరాలతో రూపొందించిన రామ మందిర చిత్రం